ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
మంగళవారం 23 జూలై 2024

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి 8

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి 8

నేతన్నల పోరుబాట



సిరిసిల్లలో రిలే నిరాహారదీక్షల్లో జేఏసీ నాయకులు





- వస్త్ర పరిశ్రమలో సంక్షోభంతో ఉపాధి కరువు
- కార్మికుల బలవన్మరణం
- వస్త్ర పరిశ్రమ జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు
- సిరిసిల్లలో మొదలైన రిలే నిరాహార దీక్షలు
- 23న రాస్తారోకో • 25న సిరిసిల్ల బంద్
- 26న అసెంబ్లీ ముట్టడి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

వస్త్ర పరిశ్రమలో సంక్షోభంతో పవర్‌లూం నేతన్నలకు ఉపాధి కరువైంది. సర్కారు ఏకపక్ష నిర్ణయాలు సిరిసిల్ల పవర్‌లూం కార్మికులకు ప్రాణ సంకటంగా మారాయి. చేతినిండా పనిలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి నెలలు గడుస్తున్నా తమను పట్టించుకోవడం లేదని మళ్లీ రోడ్డెక్కారు. సోమవారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద సిరిసిల్ల పవర్‌లూం వస్త్ర పరిశ్రమ, అనుబంధ పరిశ్రమల సమాఖ్య (జేఏసీ) ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. ఈ నెల 23న రాస్తారోకో, 25న సిరిసిల్ల బంద్ చేపట్టనున్నట్లు ప్రకటించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించని పక్షంలో ఈ నెల 26న చలో హైదరాబాద్‌లో భాగంగా అసెంబ్లీ ముట్టడికి సిద్ధమయ్యారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోవడానికి అనేక కారణాలు ఉన్నా గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరలు, ఇతర ఆర్డర్లతో చేతినిండా పని దొరికింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఆర్డర్లు నిలిచిపోయాయి. పనులు లేక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొంది. ఇటీవల ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో పవర్‌లూం కార్మికులు కుడిక్యాల నాగరాజు, తడుక శ్రీనివాస్, సిరిపురం లక్ష్మీనారాయణ, అడిచెర్ల సాయి, అంకారపు మల్లేశం ఆత్మహత్య చేసుకున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వస్త్ర పరిశ్రమ మూతపడి ఆందోళనకర పరిస్థితులు నెలకొంటున్న క్రమంలో కంటి తుడుపుగా ఆర్వీఎం, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల యూనిఫాం బట్ట ఉత్పత్తులను అందించింది. గత ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.270 కోట్ల బకాయిలు 150 కోట్ల వరకు, యారన్ సబ్సిడీ విడుదల చేసింది. సంక్షోభ నివారణకు మాత్రం చర్యలు చేపట్టడడం లేదు. తాజాగా విద్యుత్ సమస్యను ముందుకు తీసుకొచ్చింది. గతంలో సంక్షోభం నేపథ్యంలో అందిస్తూ వచ్చిన కరెంట్ సబ్సిడీపై కోతలు విధించారు. ఆత్మహత్యలు, ఆకలిచావుల నేపథ్యంలో 2001లో తెలుగుదేశం ప్రభుత్వ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు 50 శాతం విద్యుత్ రాయితీ ప్రకటించింది. అప్పటి నుంచి రాయితీ కొనసాగుతోంది. కేటగిరీ నాలుగు కింద యూనిట్ విద్యుత్ రూ.4 ఉండగా ఇందులో ప్రభుత్వం 50 శాతం భరిస్తోంది. ప్రభుత్వం మారినా విద్యుత్ సబ్సిడీ మాత్రం కొనసాగింది. 10 హెచ్‌పీలు విద్యుత్ వినియోగించుకునే విధంగా నిబంధన ఉంది. పది హెచ్‌పీలో పది మరమగ్గాలు మాత్రమే నడిపించే వీలు ఉంటుంది. పది హెచ్‌పీలపైనా వినియోగించే మరమగ్గాల కార్ఖానాలకు ప్రతీ యూనిట్‌కు రూ.7.80 చెల్లించాలి. ఇది భారంగా మారడంతో పెద్ద కార్ఖానాల యజమానులు మరగ్గాలను తగ్గించుకోవాలనే ప్రయత్నం మొదలుపెట్టారు. లోటెక్నాలజీ మగ్గాలు కావడంతో వాటిని ఎవరూ కొనుగోలు చేసేపరిస్థితి కూడాలేదు. దీంతో నష్టానికే తూకానికి అమ్ముకుంటున్నారు. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం మరమగ్గాల యజమానులు ఒకటి కంటే ఎక్కువగా సర్వీస్ కనెక్షన్లు ఉంటే వాటిని తిరిగి వాపస్ చేయాలని ప్రకటించింది. పది హెచ్‌పీల వరకు విద్యుత్ వినియోగించుకుంటే సబ్సిడీకి అర్హులుగా ఉంటారని ప్రకటించడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి.

● సంక్షోభంలో సిరిసిల్ల నేతన్నలు

ప్రభుత్వం మారడంతో ఒక్కసారిగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో చిక్కుకుంది. జిల్లాలో 35 వేల మరమగ్గాలు ఉండగా ప్రత్యక్షంగా 6500 మంది కార్మికులు ఉపాధి పొందితే పరోక్షంగా మరో 10 వేల మంది జీవిస్తున్నారు. ఆత్మహత్యల నేపథ్యంలో గత ప్రభుత్వం ఏటా బతుకమ్మ చీరల ఆర్డర్లతోపాటు ఇతర సంక్షేమ శాఖలకు సంబంధించిన బట్ట ఉత్పత్తి ఆర్డర్లు అందించింది. కొద్దిమంది యజమానులు మాత్రమే లబ్ధి పొందారనే ఆరోపణలు ఎలా ఉన్నా 2017 నుంచి నేత కార్మికులకు నిరంతరం పని దొరికింది. కొత్త ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లను నిలిపివేసింది. దీంతో సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమలో సంక్షోభం నెలకొంది.

తెగిన ఆధారానికి కారకులెవరు?

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నేతన్నలకు ఆధారమైన ఉత్పత్తులు దూరం కావడానికి కారుకులు ఎవరనేదానిపై చర్చ మొదలైంది. గతంతలో సిరిసిల్లలో మూడంచెల వ్యవస్థగా కొనసాగేది. మహారాష్ట్ర, గుజరాత్‌తోపాటు హైదరాబాద్‌కు చెందిన బడా వ్యాపారులు నూలు కొనుగోలు చేసి సిరిసిల్లలోని మాస్టర్ వీవర్ల(వార్పిన్ యజమానులు)కు అందించేవారు. వారు నూలును భీములుగా మార్చి మరమగ్గాల ఆసాములకు అందించే వారు. వారు కార్మికుల అందించడం ద్వారా బట్ట ఉత్పత్తి చేసి తిరిగి వార్పిన్ యజమానుల నుంచి బడా వ్యాపారులకు బట్ట వెళ్లేది. దేశంలో ఉన్న మార్కెట్‌కు అనుగుణంగా పాలిస్టర్ ఉత్పత్తులు సిరిసిల్లలో జరిగేవి. ఉత్పత్తుల్లో మార్పులు లేకపోవడం, తరచూ నూలు, రసాయనాల ధరలు పెరగడం, రకరకాల కారణాలతో వస్త్ర పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోనేది. భారీగా పాలిస్టర్ బట్ట నిల్వలు పేరుకుపోయే క్రమంలో మరమగ్గాలు మూతపడడం, కార్మికులు ఆత్మహత్యలకు గురవడం జరిగేది. సమ్మెలు, ఆందోళనలు కొనసాగుతూ సిరిశాల ఉరిసిల్లగా మారింది. ఈ పరిస్థితుల్లో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నిరంతరం పని ఉండే విధంగా ప్రభుత్వ ఆర్డర్లను అందించింది. ప్రభుత్వం బతుకమ్మ చీరల ఉత్పత్తి కోసం ఏటా రూ.350 కోట్ల వరకు ఖర్చు చేసినా చీరల ఉత్పత్తిపై విమర్శలను ఎదుర్కొంది. ఇదే క్రమంలో పరిశ్రమ ప్రభుత్వ ఆర్డర్లపైనే ఆధారపడే పరిస్థితి నెలకొంది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ఆర్డర్లు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రభుత్వం కూడా బట్ట ఉత్పత్తిలో మార్పులు తీసుకరాకపోవడం, ఇతర ఆర్డర్లు ఉత్పత్తి చేసే అవకాశం కూడా ఇవ్వకుండా బతుకమ్మ చీరలు, విద్యార్థులకు యూనిఫాం, ఇతర శాఖల ఆర్డర్లు ఇవ్వడంతో సొంత ఉత్పత్తులనే మర్చిపోయారు. మ్యాక్స్ సొసైటీలు, ఎస్ఎస్ఐ యూనిట్లకు ఆర్డర్లు ఇచ్చినా కొద్ది మంది చేతుల్లోకే బట్ట ఉత్పత్తి వెళ్లిపోయింది. కార్మికులు మళ్లీ మాస్టర్ వీవర్లపైనే ఆధారపడ్డారు.

నేతన్నలకు ఉపాధి కల్పించాలి

- కూరపాటి రమేష్, రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్



సిరిసిల్ల పవర్‌లూం నేత కార్మికులకు ఉపాధి కల్పించాలి. గతంలోలా బతుకమ్మ చీరల ఆర్డర్లు, యారన్ సబ్సిడీ, త్రిఫ్ట్ పథకాలను అందించాలి. బతుకమ్మ చీరలు ఇవ్వని పక్షంలో జనతా వస్త్రాల పథకాన్ని పునరుద్ధరించాలి. ఏడు నెలలుగా ప్రభుత్వం నేత కార్మికులపై నిర్లక్ష్య ధోరణిని అవలంబి స్తోంది. స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

- తాటిపాముల దామోదర్, అధ్యక్షుడు సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపారం సంఘం



సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న విద్యుత్ సబ్సిడీ సమస్య ఇతర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. పది హెచ్‌పీల వరకే రాయితీకి అనుమతి ఉందని సెస్ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో మరమగ్గాలు మూతపడ్డాయి. కొంత మంది యజమానులు తుక్కు కింద అమ్ముకున్నారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను రక్షించండి

- ఆడెపు భాస్కర్, అధ్యక్షుడు, పాలిస్టర్ అసోసియేషన్



సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ప్రభుత్వం రక్షించే చర్యలు చేపట్టాలి. వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోవడంతో వేలాది మంది కార్మికులు, ఆసాములు పనులు లేకు వీధిన పడ్డారు. ప్రభుత్వ ఆర్డర్లను అందించాలి. విద్యుత్ రాయితీ సమస్యను పరిష్కరించాలి. యారన్ డిపోను ఏర్పాటు చేయాలి. బకాయిలను విడుదల చేయాలి.

సంక్షేమ పథకాలను కొనసాగించాలి

- పంతం రవి ఏఐటీయూసీ, నాయకుడు



సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. నేతన్నలకు ఉపాధిని అందించే దిశగా ప్రభుత్వ ఉత్పత్తి ఆర్డర్లు ఇవ్వాలి. యారన్ సబ్సిడీ, త్రిఫ్ట్, నేతన్న బీమా పథకాలను కొనసాగించాలి. వర్కర్ టు ఓనర్ పథకాన్ని అందించాలి. కార్మికులకు నిరంతరం పనులు ఉండే విధంగా క్యాలెండర్ విడుదల చేయాలి.

గెరువిచ్చిన వాన

సిరిసిల్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో మూడు రోజులపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం గెరువిచ్చింది. సోమవారం రోజంతా మబ్బులు కమ్ముకున్నా వర్షం కురవలేదు. మూడు రోజులుగా ఇళ్లకు పరిమితమైన ప్రజలు వివిధ అవసరాల రీత్యా బయటకు రావడంతో జన సంచారం పెరిగింది. సోమవారం ఉదయం వరకు జిల్లాలో 21.6 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది. ఇల్లంతకుంటలో 46.3 మిల్లీమీటర్లు, రుద్రంగి 10.4, చందుర్తి 11.6, వేములవాడ రూరల్ 13.4, బోయినపల్లి 22.2, వేములవాడ 19.6, సిరిసిల్ల 20.3, కోనరావుపేట 13.8, వీర్నపల్లి 20.0, ఎల్లారెడ్డిపేట 23.2, గంభీరావుపేట 24.6, ముస్తాబాద్ 26.4, తంగళ్లపల్లిలో 29.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం ఈ సీజన్‌లో 285.6 మిల్లీమీటర్ల సాధా రణ వర్షపాతానికి 365.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

గ్రీవెన్స్ డేతో సత్వర న్యాయం



ఫిర్యాదును పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జూలై 22: బాధితులకు సత్వర న్యాయం చేయడానికే గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 18 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ, ఆస్తి తగాదాల విషయంలో చట్టం, నిబంధనల ప్రకారం న్యాయం అందించే విధంగా చూడాలన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరగా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు.

మొక్కలు నాటిన చిన్నారులు

వేములవాడ కల్చరల్, జూలై 22 : వేములవాడ పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్ చిన్నారులు మొక్కలను నాటారు. ప్లాన్‌టేషన్, రేయిన్ డేను పురస్కరించుకుని ఓ ప్రైవేటు స్కూల్ చెందిన విద్యార్థులు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నేదూరి అనిల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ఆదర్శం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట, జూలై 22: సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ఆదర్శంగా రాష్ట్రం నిలుస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వివిధ గ్రామాలకు చెందిన వారికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆరోగ్యశ్రీ మొత్తాన్ని పెంచినట్లు చెప్పారు. రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా వైద్యం అందించాడాని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. రైతులకు ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేదన్నారు. రైతు భరోసాపై రైతుల అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ జావెద్ అహమ్మద్, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ రమణారెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వినయ్‌కుమార్, నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటి, నాయకులు పాల్గొన్నారు.

● మండలంలోని పెద్దలింగాపూర్‌లో చిట్యాల ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే సత్యనారాయణ ఆవిష్కరించారు రజకసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బస్వ రాజ్ శంకర్, జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేష్, మాజీ సర్పంచ్ జితేందర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ స్వప్నకర్ణాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీత, కవి జూకంటికి సన్మానం



సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి



సిరిసిల్లలో సన్మానిస్తున్న నాయకులు

సిరిసిల్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ కవి దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారాన్ని అందుకున్న ప్రముఖ కవి జూకంటి జగన్నాథంను సోమవారం సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ అత్యుత్తమ సాహితీ పురస్కారాన్ని సిరిసిల్ల కవి జూకంటి జగన్నాథం అందుకోవడం గర్వకారణమన్నారు. శ్రమదోపిడీ, రాచరికపు వ్యవస్థ, ప్రభుత్వ వైఫల్యాలపై అక్షర గళాన్ని వినిపిస్తూ ప్రజలను చైతన్యపరిచారన్నారు.

సిరిసిల్ల రూరల్: దాశరథి కృష్ణమాచార్య సాహితీపురస్కారాన్ని అందుకున్న ప్రముఖ సాహితీవేత్త జూకంటి జగన్నాథంను సోమవారం సిరిసిల్లలో పలువురు సన్మానించారు. జిల్లా ప్రజా సమీకృత సేవా కమిటీ అధ్యక్షుడు రవివర్మ, రమేష్, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యులు బండ నాంపల్లి, బండ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా మున్సిపల్ పార్క్



వేములవాడలో నిర్మించిన మున్సిపల్ పార్క్

వేములవాడ టౌన్, జూలై 22: వేములవాడ పట్టణంలోని మండల పరిషత్ ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్క్ తుది మెరుగులుదిద్దుకొని ప్రారంభానికి సిద్ధమవుతోంది. పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు సుమారు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో మున్సిపల్ పార్క్‌ను తీర్చిదిద్దుతున్నారు. మండల పరిషత్ ఆవరణలోని ఖాళీ స్థలంలో శంఖంపై కూర్చొని ఉన్న శివుని విగ్రహం పట్టణ ప్రజలను ఆకట్టుకుంటోంది. పార్క్‌లో మూడు వాటర్ ఫౌంటేన్‌లతోపాటు వినూత్న ఆకృతుల విగ్రహాలు, బటర్‌ఫ్లైతో కూడిన విద్యుత్ లైట్లు చూపరులను కట్టిపడేస్తున్నాయి. పార్క్‌లో వాకింగ్ ట్రాక్‌ను ఢమరుకంతో కూడిన త్రిశూలం ఆకృతిలో ఏర్పాటు చేయడంతో పట్టణ వాసులను కొత్త అనుభూతిని కల్పించనుంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మ్యూజిక్ సిస్టం పట్టణ వాసులను మంత్రముగ్ధులను చేయనుంది. పార్క్ పనులు తుదిదశకు చేరుకున్న నేపథ్యంలో త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తేనున్నట్లు తెలుస్తోంది.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 22 : ప్రజావాణిలో సమర్పించే దరఖాస్తు దారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో 101 దరఖాస్తులు వచ్చాయి. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. త్వరితగతిన పరిష్కారం చూపాపడంతోపాటు అర్జీదారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో రమేష్, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ పాల్గొన్నారు.

● దాచారం శివారులో ఉన్న భూమి ఆన్‌లైన్‌లో తన పేరు చూపించడం లేదని, మార్పులు చేయాలని ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌కు చెందిన జనార్దన్‌రెడ్డి అనే రైతు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రం అందజేశారు.

● నాలుగు సంవత్సరాల నుంచి కాళ్లుచేతులు పనిచేయడం లేదని దివ్యాంగుల పెన్షన్‌ను ఇప్పించాలని ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లికి చెందిన ఉమరాణి అదనపు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేసింది.

● జిల్లాలోని గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ గ్రామపంచాయతీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నాయకులు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాల్యాల నర్సయ్య మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో అతితక్కువ వేతనంతో పని చేస్తున్న కార్మికులకు కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వేతనాలు పెంచి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 30న చలో అసెంబ్లీ చేపడతామన్నారు. వేములవాడ రూరల్ అధ్యక్షుడు ముందుకంపల్లి అనిల్, కోశాధికారి పచ్చ కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట మండలం మరమడ్ల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలకు కేటాయించిన స్థలం కబ్జాకు గురవుతోందని, హద్దులను చేసి కాపాడాలని లంబాడీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నాయకులు సోమవారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నరేష్ నాయక్ మాట్లాడుతూ మరమడ్ల ఏకలవ్య మోడల్ పాఠశాలను 2006లో ఏర్పాటు చేసిన సమయంలో 53 ఎకరాల భూమిని కేటాయించారని, ప్రస్తుతం కేవలం 11ఎకరాల 22 గుంటల భూమి మాత్రమే మిగిలి ఉందని అన్నారు.

జనహితను సద్వినియోగం చేసుకోవాలి

వేములవాడ టౌన్: జన హిత కార్యక్రమాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వేములవాడ అర్బన్ తహసీల్దార్ మహేష్ అన్నారు. వేములవాడ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జనహిత కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదులను స్వీకరించారు. ఆయా శాఖల అధికారులు తప్పకుండా జనహితకు హాజరుకావాలని సూచించారు.

తల్లిని దూషించవద్దన్నందుకు..

● తమ్ముడిని హత మార్చిన అన్న ● తండ్రిపైనా దాడి ● గోదావరిఖనిలో దారుణం



సునీల్ (ఫైల్)

కోల్‌సిటీ, జూలై 22: మద్యం సేవించి వచ్చి తల్లిని అసభ్యపదజాలంతో దూషిస్తున్న అన్నను వారించినందుకు తమ్ముడిని హత మార్చిన ఘటన సోమవారం రాత్రి గోదావరిఖని కృష్ణ నగర్‌లో చోటు చేసుకున్నది. కృష్ణనగర్‌లో నివాస ముండే ఆత్మకూరి సునీల్(27)ను అతని నివా సంలోనే అతని అన్న ఆత్మకూరి అనిల్ కత్తితో పొడిచి హత్య చేశాడు. అడ్డు వచ్చిన అతని తండ్రి ఓదెలును కూడా పొడిచాడు. ఘటనకు సంబం ధించి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. అంతర్గాం మండలం పెద్దం పేటకు చెందిన ఆత్మకూరి ఓదెలు కుటుంబం కొన్నేళ్ల క్రితం గోదావరిఖనికి వచ్చి స్థిరపడింది. అతడు టెంట్‌హౌస్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి అనిల్, సునీల్(27) కుమారులు ఉన్నారు. సునీల్ శ్రీకళ ను ప్రేమ వివాహం చేసుకోగా విజయరాం(3), వియ(2) పిల్లలు ఉన్నారు. అనిల్ ట్యాక్సీ డ్రైవర్‌గా పని చేస్తుండగా సునీల్ బస్టాండ్ వద్ద హోటల్ నడుపుతున్నాడు. అనిల్ గతంలో హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్న సమయంలో ఒక వివాహితను ప్రేమించానని, ఆమెతో తన పెళ్లి జరిపించాలంటూ తల్లి రాజమ్మపై ఒత్తిడి తీసుకు వచ్చేవాడు.



చికిత్స పొందుతున్న తండ్రి ఓదెలు

మద్యానికి బానిసైన అనిల్ తండ్రి టెంట్‌హౌస్‌లోని సామగ్రిని కూడా అమ్ముకుని మద్యం సేవించేవాడు. చిల్లర దొంగతనాలకు సైతం పాల్పడేవా డు. సోమవారం రాత్రి మద్యం తాగి వచ్చిన అనిల్ తల్లి రాజమ్మతో గొడవ పడి అసభ్యపద జాలంతో దూషిం చాడు. అదే సమయంలో ఇంటికి వచ్చిన తమ్ముడు సునీల్ అడ్డు చెప్పడంతో కత్తితో దాడికి పాల్ప డ్డాడు. విచక్షణ రహితంగా పొడవ డంతో సునీల్ కుప్పకూలాడు. అడ్డు వెళ్లిన తండ్రి ఓదెలును కత్తితో పొడిచాడు. అతడు కూడా గాయపడ్డాడు. తీవ్రగాయాల పాలైన సునీల్‌ను గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతి చెందినట్టు వైద్యులు పేర్కొన్నారు. గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరుపుతున్నారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

రాయికల్, జూలై 22: మండలంలోని మూటపెల్లి గ్రామానికి చెందిన మ్యాకల భూమరాజు(45) అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భూమరాజుకు భర్త రాజంతో 20 సంవత్సరాల క్రితం విడాకులు అయ్యాయి. కొడుకు కూడా తండ్రితో పాటు ఉండగా భూమరాజు ఒంటరిగా జీవిస్తోంది. కొద్దిరోజుల నుంచి అనారోగ్య సమస్యలతో బాధ పడుతూ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై అనిల్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

రాయికల్, జూలై 22: మండలంలోని అయోధ్య గ్రామానికి చెందిన నందగిరి గంగారాం పెద్ద కుమార్తె శివానీ (18) డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెంది ఈ నెల 6న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కుటుంబసభ్యులు శివానిని మొదట జగిత్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఈ నెల 21న హైదరాబాద్ నుంచి జగిత్యాల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మార్గ మధ్యలోనే మృతి చెందింది. మృతదేహాన్ని సోమవారం జగిత్యాల జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. శివానీ కుటుంబసభ్యులను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి వేర్వేరుగా పరామర్శించారు.

ఒకరి అరెస్టు

చందుర్తి జూలై 22: గంజాయి కేసు అరెస్ట్ నుంచి తమ్ముడిని తప్పించడానికి తమ్ముడి ఆత్మహత్యాయత్నానికి ప్రోత్సహించిన కేసులో అన్నను అరెస్టు చేసినట్లు చందుర్తి ఎస్సై శ్రీకాంత్ సోమవారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన తోట అఖిల్‌పై వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో 31 జనవరి 2024న గంజాయి సరఫరా చేసిన సంఘటనలో కేసు నమోదైంది. ఈ నెల 17న చందుర్తి పోలీసులు అఖిల్‌ను అదుపులోకి తీసుకొని, వేములవాడ రూరల్ పోలీసులకు అప్పగించారు. అఖిల్‌ను వేములవాడకు తరలిస్తుండగా తమ్ముడినిని అరెస్టు నుంచి తప్పించడానికి అన్న రాకేష్ అగ్గిపెట్టెలో బ్లేడు తీసుకువచ్చి తమ్ముడైన అఖిల్‌కు ఇచ్చాడు. అఖిల్ బ్లేడుతో చెయ్యి, కాలు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తమ్ముడి ఆత్మహత్యాయత్నానికి కారకుడైన రాకేష్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డుపై పడిన చెట్టును తొలగించిన పోలీసులు



చెట్టును తొలగిస్తున్న పోలీసులు

వీర్నపల్లి, జూలై 22: మండలంలో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన వర్షానికి ఎల్లారెడ్డిపేట - వీర్నపల్లి ప్రధాన రహదారిపై కంచర్ల శివారులో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎల్లాగౌడ్ సిబ్బందితో కలిసి రోడ్డుకు అడ్డంగా ఉన్న కొమ్మలను తొలగించారు. వాహనదారులకు సమస్యలు తలెత్తకుండా చేశారు.

మారుమూల గ్రామాలకు అదనపు బస్సులు నడపాలి



గర్జనపల్లిలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, నాయకులు

వీర్నపల్లి, జూలై 22: మారుమూల అటవీ గ్రామాలకు అదనంగా బస్సులు నడపాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జల ప్రశాంత్ డిమాండ్ చేశారు. మండలంలోని గర్జనపల్లిలో ప్రధాన రహదారిపై విద్యార్థులు, గ్రామస్థులు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. సిరిసిల్ల నుంచి వన్‌పల్లి వరకు ఉదయం, సాయంత్రం ఒకసారి బస్సును నడపడంతో ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. నాయకులు దేవేందర్, రాజన్న, అభిషేక్, రవి, సునీల్, బాబు పాల్గొన్నారు.

ఎనిమిది ఆటోలు సీజ్

కరీంనగర్ క్రైం, జూలై 22: కరీంనగర్‌లో మూడో ఠాణా సీఐ జాన్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు సోమవారం రాత్రి ప్రత్యేక తనిఖీలు నిర్వహించి డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్‌లు లేని ఎనిమిది ఆటోలను సీజ్ చేశారు. ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఈ వాహన తనిఖీలు నిర్వహించగా టౌన్ ఏసీపీ జి.నరేందర్ పర్యవేక్షించారు. నిబంధనల ప్రకారం అన్ని ఆటో డ్రైవర్లు, ఇతర వాహనాల డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనానికి సంబంధించిన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని పోలీసులు పేర్కొన్నారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలి

● సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారుల రిలే దీక్షలు

సిరిసిల్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పవర్‌లూం వస్త్ర పరిశ్రమలో నెలకొన్న విద్యుత్ సమస్యలు, వస్త్ర సంక్షోభాన్ని నివారించాలని వస్త్రోత్పత్తిదారులు, కార్మిక సంఘాలు ఆందోళన బాట పట్టాయి. సోమవారం సిరిసిల్ల పవర్‌లూం వస్త్ర పరిశ్రమ, అనుబంధ పరిశ్రమల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సంక్షోభం నివారణ, విద్యుత్ సమస్య పరిష్కారం, నేతన్నలకు ఉపాధి కల్పన, పెండింగ్ బకాయిల విడుదలకు జేఏసీ ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టినట్లు చెప్పారు. నేతన్న పోరుయాత్ర రాష్ట్ర వ్యాప్తంగా చేస్తామని సీఐటీయూ ప్రకటించగా ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడంతో యాత్ర వాయిదా వేశామన్నారు. 20 రోజులైనా ప్రభుత్వం నుంచి చలనం లేదన్నారు. రిలే దీక్షలకు మద్దతుగా మంగళవారం రాస్తారోకో, 25న సిరిసిల్ల పట్టణ బంద్, 26న చలో హైదరాబాద్ చేపట్టనున్నట్లు తెలిపారు. కేంద్రంలో ఉన్న బీజేపీ కూడా వస్త్ర పరిశ్రమపై జీఎస్టీ విధించి పరిశ్రమ సంక్షోభానికి కారణమైందన్నారు. ఓవైపు సమస్యను సృష్టిస్తూ సానుభూతి ప్రదర్శించడం సరైన పద్ధతి కాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు నేతన్నల మీద ప్రేమ ఉంటే ప్రధానితో మాట్లాడి కేంద్రం నుంచి వస్త్రాల ఆర్డర్లను ఇప్పించాలని అన్నారు. అనంతరం దీక్షలకు బీజేపీ అధికార ప్రతినిధి రాణీరుద్రమ, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, బీజేపీ నాయకులు నరేష్, సదానందం, రాజు, శ్రీకాంత్, ప్రకాష్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాణీరుద్రమ మాట్లాడుతూ బతుకమ్మ చీరల బకాయిలు వడ్డీతో సహా చెల్లించాలన్నారు. నేతన్నలకు విద్యుత్ సబ్సిడీతోపాటు సంక్షోభంలో ఉన్న వస్త్ర పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సిరిసిల్ల ఉత్పత్తులు ఒకప్పుడు బ్రాండ్‌లాగా ఉండేవని, సొంతంగా మార్కెట్ చేసుకునే పరిస్థితి ఉండేదని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో బతుకమ్మ చీరల పేరిట ఆదుకుంటామని చెప్పి నాసిరకం చీరలను ఉత్పత్తి చేయించారన్నారు. కార్మికులకు రూ.15 వేల కూలి దొరికేదని, బతుకమ్మ చీరలతో కొంతమంది ఆసాములు లాభపడ్డారని అన్నారు. ప్రభుత్వం బకాయిలను వడ్డీతో సహా చెల్లించాలని, ఆర్డర్లను అందించాలని కోరారు. మొదటి రోజు రిలే దీక్షల్లో చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు అడెపు భాస్కర్, కాటన్ వస్త్రోత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు కట్టెకోల లక్ష్మీనారాయణ, ఆసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, ఏఐటీయూసీ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వేణు, వైపని వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కుమ్మరికుంట కిషన్, యారన్ అసోసియేషన్ అధ్యక్షుడు పిస్క మధు, డైయింగ్ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి కోడం శ్రీనివాస్, మ్యాక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, వస్త్ర వ్యాపార సంఘం కోశాధికారి శ్రీగాధ విష్ణు, డైరెక్టర్లు అన్నల్‌దాస్ శ్రీనివాస్, బొడ్డు శ్రీధర్, పాలిస్టర్ అసోసియేషన్ కోశాధికారి మండల బాలరాజు, శ్రీరాం సత్యం, మండల రాజు, గాజుల లింగం దీక్షల్లో కూర్చున్నారు. దీక్షలను మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, పాలిస్టర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మండల సత్యం తదితరులు ప్రారంభించారు.



దీక్షలను ప్రారంభిస్తున్న పవర్‌లూం వర్కర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ , సంఘీభావం తెలుపుతున్న బీజేపీ నాయకులు

చెరువులో పడి బాలుడి మృతి

తిమ్మాపూర్, జూలై22: మండలంలోని మొగిళిపాలెం గ్రామంలో ప్రమాదవ శాత్తూ చెరువులో పడి బాలుడు మృతిచెందాడు. స్థానికులు, ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొగిళిపాలెం గ్రామానికి చెందిన జువ్వాజి మురళి, పద్మల ఏకైక కుమారుడు జువ్వాజి సాయికృష్ణ(12) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. సోమవారం పాఠశాలకు వెళ్లిన సాయికృష్ణ మధ్యాహ్నం భోజనం అనంతరం పాఠశాల నుంచి ఇంటికి వెళ్లి తిరిగి పాఠశాలకు వెళ్లాడు. పాఠశాలలోని ముగ్గురు స్నేహితులు కలిసి పాఠశాల వెనకాల గల ఊర చెరువు వద్దకు సైకిల్‌తో ఆడుకుంటూ వెళ్లాడు. చెరువు సమీపంలో సాయికృష్ణ బహిర్భూమికి వెళ్లి చెరువు మెట్ల వద్ద నీటి వద్దకు వెళ్లాడు. ప్రమాదవ శాత్తు చెరువులో పడి గల్లంతయ్యాడు. సాయికృష్ణతో వచ్చిన మిత్రులు గమనించి స్థానికంగా పొలంలో ట్రాక్టర్ నడుపుతున్న వ్యక్తికితో పాటు సాయికృష్ణ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే చెరువులోకి దిగి వెతకగా మృతదేహం లభ్యమైంది. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.


సాయికృష్ణ(ఫైల్)

ఇద్దరు నేరస్తులపై పీడియాక్ట్

కోరుట్ల, జూలై 22 : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇద్దరు నేరస్తులపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు సోమవారం వెల్లడించారు. పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కోరుట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ బాబు, ఎస్ఐ కిరణ్ కుమార్‌లతో కలిసి వివరాలను వెల్లడించారు. కోరుట్ల పట్టణంలోని ఝూన్సిరోడ్డుకు చెందిన విత్తనాల నాగరాజు, అర్బన్ కాలనీకి చెందిన గుడ్ల విశాల్‌లపై ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు. కోరుట్ల పట్టణంతో పాటు కరీం నగర్ ఉమ్మడి జిల్లాలో హత్య కేసులు, సుపారి హత్యలు, బలవంతపు వసూళ్లలో నిందితులుగా ఉన్న నాగరాజు, విశాల్‌లపై పీడీ యాక్ట్‌ను విధించగా వారు ప్రస్తుతం హైదరాబాదులోని చెర్లపల్లి జైలో రిమాండ్ ఖైదీలుగా ఉన్నట్లు వివరించారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

బాలకార్మికుడిని పనిలో పెట్టుకున్న వ్యక్తిపై కేసు

గంగాధర, జూలై 22: గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో బాలకార్మికుడిని పనిలో పెట్టుకున్న యాజమానిపై జిల్లా లేబర్ ఆఫీసర్ గుండేటి చక్రధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా లేబర్ ఆఫీసర్ నేతృత్వంలోని బృందం గంగాధర మండలంలో ఆపరేషన్ ముస్కాన్10లో భాగంగా తనిఖీలు చేపట్టారు. మధురానగర్ చౌరస్తాలో రాజస్థాన్‌కు చెందిన సురేష్ చంద్ర గుజ్జర్ అనే అతను తన పానిపూరీ బండి వద్ద 11 సంవత్సరాల బాలుడిని పనిలో పెట్టుకున్నాడు. బాలుడి వివరాలు సేకరించిన జిల్లా లేబర్ ఆఫీసర్ యాజమాని పనిలో పెట్టుకున్నట్లు తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యాష్‌పాండ్‌ను వ్యతిరేకిస్తూ ధర్నా నేడు

కోల్‌సిటీ, జూలై 22: ఎన్‌టీపీసీ రిజర్వాయర్‌లో నిబంధనలకు విరుద్ధంగా యాష్ పాండ్‌ను ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ప్రభావిత గ్రామాలైన ఎల్కలపల్లి, గుంటూరుపల్లి, లక్ష్మీపూర్, మారేడుపాక, ఎల్కలపల్లి గేట్ గ్రామస్థులు రిజర్వాయర్ వద్ద ధర్నా నిర్వహించనున్నారు. ఎన్‌టీపీసీ ప్రభావిత గ్రామాలను కాదని ఆన్‌లైన్ బూడిద టెండర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఈ ధర్నాను నిర్వహిస్తున్నట్లు తెలిరాఅట. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, జూలై 22: మండలంలోని రాగినేడు గ్రామానికి చెందిన మామిడిపల్లి వంశీ (27) అనే యువకుడు ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వంశీ ఒక అమ్మాయిని ప్రేమించాడని, ఆమెను పెళ్లి చేసుకుంటానని ఇంట్లో తెలుపగా తిరస్కరించినట్లు తెలిపారు. ప్రేమించిన అమ్మాయి దక్కదేమోనని ఆందోళన చెంది ఈ నెల 14న గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద పురుగుల మందు ఆత్మహత్యాయత్నం చేశాడు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. మృతుడు వంశీ సమాచారం ఇవ్వడంతో పెద్దపల్లి ఆసుపత్రికి అక్కడి నుండి కరీంనగర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుని తల్లి లింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

బేకరీల్లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

● తాటిపల్లి బాలికల గురుకుల హాస్టల్‌లోనూ తనిఖీ ● చెడిపోయిన వస్తువులను పడేసిన అధికారులు

మల్యాల, జూలై 22: మల్యాలలోని బేకరీలు, తాటిపల్లి బాలికల గురుకుల హాస్టల్‌లో సోమవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. కాలం చెల్లిన వస్తువుల వినియోగం, బూజు వచ్చిన తినుబండారాల అమ్మకాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మల్యాలలో గల బేకరీల్లో బూజు వచ్చిన కేకులు, కాలం చెల్లిన బిస్కట్లు, ఆరోగ్యానికి హాని చేసే రంగుల క్రీమ్‌లు లభించడంతో ఆహార తనిఖీ అధికారి ఆర్.అనూష మండిపడ్డారు. చిన్నపిల్లలు తినే ఇలాంటి వాటిని శుచి, శుభ్రతతో కాకుండా అధ్వాన్నంగా బూజు వచ్చిన వాటితో తయారు చేసి అమ్మడం ఏమిటని, ఆహార విక్రయాలకు సంబంధించి సర్టిఫికెట్లు తీసుకోకపోవడంపై నిర్వాహకులను నిలదీశారు. వారం రోజుల్లోగా తీరు మార్చుకోవాలని లేనిచో సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం బూజు వచ్చిన కేక్‌లు, బిస్కట్ పాకెట్లు, రంగుల పొడిలు ఇతర వస్తువులు పడేశారు. అంతకు ముందు తాటిపల్లి బాలికల గురుకుల హాస్టల్‌లో తనిఖీలు చేసి చెడిపోయిన ఉల్లిగడ్డలను వంటలలో వినియోగించడం, ఆదివారం నాటి మటన్ సోమవారం వండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.


కుళ్లిపోయిన పదార్థాలను పడేసిన అధికారులు

రైస్ మిల్లుల్లో అధికారుల విస్తృత తనిఖీలు

● ఇతర జిల్లాల సివిల్ సప్లయ్ అధికారులకు బాధ్యతలు


జగిత్యాలలో తనిఖీ చేస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు


కాల్వశ్రీరాంపూర్‌లోని రైస్‌మిల్లులో తనిఖీ చేస్తున్న అధికారులు

జగిత్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు రైస్ మిల్లుల్లో సోమవారం సివిల్ సప్లయ్ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. రాష్ట్ర సివిల్ సప్లయ్ శాఖ కమిషనర్ చౌహాన్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇతర జిల్లాలకు చెందిన అధికారులు, ఎన్‌ఫోర్స్ బృందాలు రైస్ మిల్లుల్లో దాడులు నిర్వహించారు. ప్రభుత్వం రైస్ మిల్లులకు సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం నిల్వలు సరిగా ఉన్నాయా...లేవా అన్న అంశంపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని పలు చోట్ల సోదాలు జరిగాయి. జిల్లాలోని సాయిసుధ ఇండస్ట్రీస్, కొత్త శ్రీయాన్ రైస్ మిల్లు, సిరికొండ జీఎస్‌కే ఇండస్ట్రీస్, కొండికర్ల మహాలక్ష్మి ఇండస్ట్రీస్, పెద్దాపూర్ నిజాం ఆగ్రో ఇండస్ట్రీస్, చెప్యాల్ శ్రీ లక్ష్మీ సరస్వతీ ఇండస్ట్రీస్, శ్రీ లక్ష్మీ సాయి ఇండస్ట్రీస్, గగన్ ట్రేడర్స్ ఇండస్ట్రీస్, నూకపల్లి గునా ఇండస్ట్రీస్, చందోల్ మాధవి ఆగ్రో ఇండస్ట్రీస్, శివ సాయి ఆగ్రో ఇండస్ట్రీస్, శ్రీమన్నారాయణ ఇండస్ట్రీస్, మణికంఠ ఆగ్రోటెక్ రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయి అధికారులు సోదాలు నిర్వహించారు. రైస్ మిల్లుల్లో గల ధాన్యం నిల్వల ఫిజికల్ వెరిఫికేషన్ జరిపారు. తనిఖీల్లో గుర్తించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నారు. కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్, జగిత్యాల జిల్లా సివిల్ సప్లయి అధికారి వెంకటేశ్వర్ రావు, సివిల్ సప్లయి కార్పొరేషన్ మేనేజర్ హతీరాం, జడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్, ఈజీఎస్ ఏపీడీ మధన్ మోహన్, తహసీల్దార్లు, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

● **కాల్వ శ్రీరాంపూర్** : మండలంలోని మంగపేట గ్రామంలోని అన్నదాత ఇండస్ట్రీస్ రైస్ మిల్లును సోమవారం సివిల్ సప్లై అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, సేల్స్ రిజిష్టర్, స్టాక్ రిజిష్టర్‌లను పరిశీలించారు. నివేదికను జిల్లా ఉన్నత అధికారులకు అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఈ తనిఖీలలో జిల్లా సివిల్ సప్లై అధికారి ప్రేమ్ కుమార్, డీఎం శ్రీకాంత్, డీటీసీఎస్ రాథోడ్, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఎఫ్ఐ మల్లికార్జునరావు, ఆర్ఐ రాజేందర్, స్థానిక ఎస్సై ఓంకార్‌యాదవ్ పాల్గొన్నారు.

అటవీశాఖ ఉద్యోగుల బదిలీలు

కరీంనగర్ క్రైం, జూలై 22: జిల్లా అటవీశాఖలో భారీగా బదిలీలు జరిగాయి. రెండేళ్ల సర్వీసు పూర్తి అయిన పలువురు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లకు స్థానచలనం జరిగింది. కరీంనగర్ ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్‌వో) గంటల శ్రీనివాస్‌రెడ్డి ఆదిలాబాద్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో తాడ్వాయిలో పనిచేస్తున్న ఎఫ్ఆర్‌వో షౌకత్‌హుస్సేన్ నియామకమయ్యారు. హుజూరాబాద్ ఎఫ్ఆర్ రాజేశ్వర్‌రావు భూపాలపల్లి జిల్లా కొయ్యూర్ రేంజ్‌కు బదిలీ అయ్యారు. గంగాధర డిప్యూటీ ఎఫ్ఆర్‌వో కిరణ్మయి కరీంనగర్ స్ట్రైకింగ్‌ఫోర్స్‌కు, సిరిసిల్ల డిప్యూటీ ఎఫ్ఆర్‌వో బాపిరాజు గంగాధరకు బదిలీ అయ్యారు. చొప్పదండి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వి వేణుభరణ్ కరీంనగర్‌కు, శంకరపట్నంలో పనిచేస్తున్న ఎఫ్ఎస్‌వో సరిత కామారెడ్డికి, వేములవాడలో పనిచేస్తున్న ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్ చొప్పదండికి బదిలీ అయ్యారు. జమ్మికుంటలో పనిచేస్తున్న ఫారెస్ట్‌బీట్ ఆఫీసర్ అనంతరాం గంగాధరకు, అక్కడ పనిచేస్తున్న ఎఫ్‌బీవో సమీనాసర్వీన్ తిమ్మాపూర్‌కు, అక్కడ పనిచేస్తున్న ఎఫ్‌బీవో సుజాత కరీంనగర్ డీర్‌పార్క్‌కు బదిలీ అయ్యారు.

ఫేక్ ఐడీతో మహిళలకు చాటింగ్

రుద్రంగి, జూలై 22 ఓ యువకుడి ఫొటోను స్నాప్ చాట్‌లో ప్రొఫైల్‌గా పెట్టి ఫేక్ అకౌంట్‌తో మహిళలకు చాటింగ్ చేసిన సంఘటన రుద్రంగిలో వెలుగుచూసింది. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన దినేష్ అనే యువకుడి ఫొటోను స్నాప్‌చాట్‌లో ప్రొఫైల్ పెట్టి గుర్తు తెలియని వ్యక్తులు ఫేక్ అకౌంట్ ఓపెన్ చేశారు. దీంతో మహిళలకు అసభ్యకరంగా చాటింగ్ చేస్తున్నారని, స్నాప్‌చాట్ ఫేక్ ఆకౌంట్‌తో చాటింగ్ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని దినేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసిన వ్యక్తులను పట్టుకుంటామని ఎస్ఐ సిరిసిల్ల ఆశోక్ తెలిపారు.

నిజాయితీ చాటుకున్న మహిళ


మహిళను సన్మానిస్తున్న ఎస్సై

రామగిరి, జూలై 22: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన నీర్ల విజయ అనే గృహిణి తనకు దొరికిన విలువైన సెల్‌ఫోన్‌ను అప్పగించి సోమవారం తన నిజాయితీ చాటుకుంది. గ్రామానికి చెందిన చెల్పూరి రాజమౌళికి చెందిన రూ.80వేల విలువ గల సెల్‌ఫోన్ ఫ్యాంట్ జేబులోంచి దారిలో పడిపోయింది. సదరు మహిళ సెల్‌ఫోన్ దొరికిన వివరాలను మాజీ జెడ్‌పీటీసీ గంటవెంకటరమణరెడ్డికి తెలుపగా పోలీస్‌స్టేషన్ అప్పగించాల్సిందిగా సదరు మహిళకు సూచించారు. అదే గ్రామానికి చెందిన రాజమౌళిదిగా పోలీసులు గుర్తించి అప్పగించారు. సదరు మహిళను ఎస్ఐ సందీప్ అభినందించారు.

సబ్బితం జలపాతం సందర్శనకు రావద్దు


జలపాతం సందర్శనకు వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎంపీవో

పెద్దపల్లి రూరల్, జూలై 22: మండలంలోని సబ్బితం గ్రామ పంచాయతీ పరిధిలోని గట్టు సింగారం గౌరిగుండాల జలపాతం సందర్శన నిషేధించామని సందర్శకులు ఎవరూ రావద్దని ఎంపీవో సుదర్శన్ సూచించారు. సోమవారం మండలంలోని రంగాపూర్ నుంచి సబ్బితం వెళ్లే ప్రధాన రహదారి ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలని అధికారులకు సూచించారు. అనంతరం గౌరిగుండాల జలపాతాన్ని ఎంపీవో పరిశీలించారు. ఈ సందర్భంగా సందర్శనకు పలువురు యువకులు రాగా జలపాతానికి వరద ఎక్కువగా వస్తుందని, ఈ సందర్భంగా సందర్శనను నిషేధించినట్లు వారికి తెలిపి వెనక్కి పంపించారు. సందర్శకులు, యువకులు గమనించి సహకరించాలని ఎంపీవో సుదర్శన్ సూచించారు. వారి వెంట ఏపీవో రమేష్‌బాబు, ఫీల్డ్ అసిస్టెంట్ ఇండ్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి పెరుగుతున్న వరద

● ప్రాజెక్టులోకి 20,023 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీటి రాక పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 20,023 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం సోమవారం 21.029 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 42.534 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 15.108 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

కోటిలింగాల వద్ద పెరుగుతున్న గోదావరి నీటి మట్టం

వెల్గటూర్, జూలై 22: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోటిలింగాల వద్ద గోదావరి నీటి మట్టం పెరుగుతోంది. వాగులు, వంకలు పొంగి గోదావరిలోకి వరద నీరు చేరుతుండడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. కడెం ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి 3389 క్యూసెక్కులు నీటిని దిగువ ప్రాంతానికి వదలడంతో గోదావరిలోకి వరద నీరు చేరి నీటి మట్టం పెరుగుతోంది.

గంజాయి విక్రయదారుల అరెస్టు

సిరిసిల్ల క్రైం, జూలై 22: ఇల్లంతకుంట మండలంలోని వంతడుపుల వద్ద గంజాయి విక్రయిస్తున్న తాళ్లపల్లి గ్రామానికి చెందిన తలపల్లి నాగిరెడ్డి (24), కరీంనగర్ పట్టణంలోని పద్మనగర్‌కు చెందిన గుర్రాల నిఖిల్‌రెడ్డి(19)లు అనే యువకులను అరెస్ట్ చేశామని సిరిసిల్ల రూరల్ సిఐ మొగిలి తెలిపారు. సిరిసిల్ల సర్కిల్ కార్యాలయంలో ఎస్ఐ శ్రీకాంత్‌తో కలిసి సోమవారం ఆయన అరెస్ట్ వింరాలు వెల్లడించారు. ఇల్లంతకుంట మండలంలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన నాగిరెడ్డి అనే యువకుడు కరీంనగర్‌లోని వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తూ గుర్రాల నిఖిల్‌రెడ్డితో పరిచయం ఏర్పడిందన్నారు. ఇద్దరు యువకులు గంజాయి తాగడానికి అలవాటు పడి మరికొందరికి విక్రయించేందుకు ద్విచక్రవాహనంపై ఇల్లంతకుంటకు వస్తున్నారనే సమాచారం మేరకు మార్గమధ్యలో వంతడ్పుల వద్ద అదుపులోకి తీసుకొని విచారించగా 100 గ్రాముల గంజాయి లభించదన్నారు. దీంతో 100 గ్రాముల గంజాయిని, ద్విచక్రవాహనం, రెండు మొబైల్ ఫోన్స్‌లను స్వాధీనం చేసుకొని ఇద్దరు యువకులను రిమాండ్‌కు తరలించామని తెలిపారు. యువత గంజాయికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, ఎవరైనా గంజాయి విక్రయిస్తే వెంటనే డయల్ 100 లేదా 8712656392కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

పెద్దపల్లి టౌన్: గంజాయి మాదకద్రవ్యాల రవాణా, వినియోగంపై ఉక్కు పాదం మోపుతున్నట్లు ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. సోమవారం రైల్వేస్టేషన్, బస్టాండ్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు చేప ట్టారు. ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా పరిశీంచారు. బస్సులు, ట్రైన్‌లలో డాగ్ స్క్వాడ్‌తో సోదాలు చేశారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగం నియంత్రణ ముందస్తు చర్యల్లో భాగంగా పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ పర్యవేక్షణలో పెద్దపల్లి సీఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ... గంజాయి, మాదకద్రవ్యాల వంటి వాటిని అరికట్టడం, రవాణా, నియంత్రణలో భాగంగా పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో, బస్టాండ్, పార్సెల్ సర్వీస్ కేంద్రాలు, అనుమానాస్పదంగా కనిపించే ప్రతీ పార్సిల్, రవాణా బ్యాగులను, ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేశామని తెలిపారు. నిత్యం తనిఖీలు చేపడుతామని తెలిపారు.


అరెస్ట్ చూపుతున్న సిరిసిల్ల పోలీసులు


పెద్దపల్లి బస్టాండ్‌లో పోలీసుల తనిఖీలు

కాళేశ్వరం తెలంగాణకు జీవధార

● ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌పై బురదజల్లే ప్రయత్నం
● మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కరీంనగర్ టౌన్, జూలై 22: కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు జీవధార అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ప్రాజెక్టు విషయంలో మాజీ సీఎం కేసీఆర్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తే చరిత్రహీనులవుతారని ఆయన హెచ్చరించారు. సోమవారం నగరంలోని ఆయన నివాసగృహంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ నిండుకుండలా మేడిగడ్డ బ్యారేజీ మారిందన్నారు. కాంగ్రెస్ కుట్రలను తట్టుకొని కాళేశ్వరం ప్రాజెక్టు నిలిచిందన్నారు. మేడిగడ్డ బ్యారేజీ మొత్తం కుంగిపోయిందని, కాళేశ్వరం కొట్టుకు పోయిందంటూ కాంగ్రెస్ పార్టీ, యూట్యూబ్ చానెళ్ల నెలల పాటు దుష్ప్రచారం చేసినా వాళ్ల కుతంత్రాలను కడిగేస్తూ లక్షల క్యూసెక్కుల వరద నీరు నేడు మేడిగడ్డ వద్ద ప్రవహిస్తోందని అన్నారు. ప్రస్తుతం మేడిగడ్డ బ్యారేజీ ఇన్‌ఫ్లో 8 లక్షల 20వేల క్యూసెక్కులుంటే అవుట్ ఫ్లో 8 లక్షల 20 వేల క్యూసెక్కులని చెప్పారు. 85 గేట్లు ఎత్తి దిగువకు నీళ్ల వదులుతున్నారని అన్నారు. ఆరు రోజుల్లో 73 టీఎంసీల నీరు సముద్రం పాలైందని అన్నారు. 7వ బ్లాక్‌లోని 20,21వ పిల్లర్‌లు సురక్షితంగా ఉన్నాయని అన్నారు. మేడిగడ్డ గేట్లు మూసివేస్తేనే ప్రాజెక్టు గురించి తెలుస్తుందని కాంగ్రెస్ పార్టీ వింతవాదన చేస్తోందని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డిలు చెబితే గేట్లు తెరవడం కానీ, మూయడం కానీ జరుగదని,అది నీళ్ల వరద మీద ఆధారపడి ఉంటుందన్నారు.


మాట్లాడుతున్న కొప్పుల

మొరాయించిన ఆర్టీసీ బస్సు

గంగాధర,జూలై 22: గంగాధరలో మోడల్ స్కూల్ విద్యార్థులను తీసుకెళ్లే ఆర్టీసీ బస్సు మొరాయించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. సోమవారం గంగాధర మోడల్ స్కూల్‌కు విద్యార్థులను తీసుకెల్తుతున్న ఆర్టీసీ బస్సు మధురానగర్ చౌరస్తాలో నిలిపి విద్యార్థులను ఎక్కించుకునే తరుణంలో ఆగిపోయింది. డ్రైవర్ బస్సును స్టార్ట్ చేద్దామని అరగంట ప్రయత్నించినా స్టార్ట్ కాలేదు. చేసేది లేక విద్యార్థులు వెనక నుంచి నెట్టినా ఎంతకీ స్టార్ట్ కాలేదు. దీంతో మరో బస్సును రప్పించి విద్యార్థులను పాఠశాలకు చేర్చారు. అరగంట పాటు ఆచంపల్లి, గరకుర్తి, తాడిజెర్రి, రంగరావుపల్లి, కురిక్యాల, మధురానగర్‌కు చెందిన విద్యార్థులు పాఠశాలకు వెల్తామా లేదా అని ఆందోళన వ్యక్తం చేశారు.


నిలిచిపోయిన బస్సును నెట్టుతున్న విద్యార్థులు

రూ.7,260 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూలై 22: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7260 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు నలుగురు రైతులు 81క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు రెండు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7260, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 22 : ఆశావర్కర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుతో సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్లపై గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా సమస్యలు పరిష్కరిస్తుందని ఎదురుచుస్తున్న ఆశావర్కర్లకు కొత్త సమస్యలు తెచ్చి పెడుతోందన్నారు. ప్రజారోగ్యం కోసం ఆశావర్కర్లు నిత్యం సేవలందిస్తున్నట్లు చెప్పారు. కరోనా సమయంలో ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా పని చేశారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆశావర్కర్లకు నష్టం కల్గించే విధానాలను మానుకోవాలని, పరీక్షలు నిర్వహించే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని అన్నారు. అశావర్కర్లకు నెలకు రూ.18వేలు ఫిక్స్‌డ్ వేతనాన్ని అందించాలన్నారు. పని భారం తగ్గించి జాబ్‌చాట్ ప్రకటించాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ప్రమాద బీమా సౌకర్యంతోపాటు పదవీవిరమణ పెన్షన్‌కు సంబంధించిన సర్క్యులర్లను జారీ చేయాలన్నారు. జిల్లాలో ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో డ్యూటీ చేసిన ఆశావర్కర్లకు డబ్బులు ఇవ్వలేదన్నారు. కలెక్టర్ స్పందించి ఆశా వర్కర్స్ యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరపాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకుముందు జిల్లా వైద్యాధికారి డాక్టర్ నయిమా అక్కడికి రాగా కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తామని తెలిపారు. పోలీసులు అదనపుకలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పదిమందిని అనుమతించారు. జిల్లా సీఐటీయూ కార్యదర్శి కోడం రమణ ఆధ్వర్యంలో అశావర్కర్లు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, అన్నల్‌దాస్ గణేష్, ఎలిగేటి రాజశేఖర్, అశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల జిల్లా కార్యదర్శి జయశీల, గౌరవ అధ్యక్షురాలు భారతి, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మొక్క నాటి నీరు పోస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూలై 22 : ప్రతి ఒక్కరూ మొక్క నాటి సంరక్షించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలంలోని మారుపాక, అనుపురం, రుద్రవరంలో మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య ఆధ్వర్యంలో వనమహోత్స వంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమం ఉద్యమంలా సాగాలని పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు ఒక మొక్క నాటి ఆకుపచ్చ తెలంగాణ ఆవిష్కరణలో తన వంతు పాత్ర పోషించాలన్నారు. చెట్ల ప్రాముఖ్యతను పాఠ్యపుస్తకాల్లో చదువుకున్నామని గుర్తు చేశారు. ఇప్పుడున్న పరిస్థితిలో అంతరించిపోతున్న అడవులను కాపాడే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలను పెంచడంతో స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వనమహోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వం అటవీ సంపదను కాపాడుకోవడానికి చర్యలు చేపడుతోందన్నారు. వర్షాకాలంలో మొక్కలు నాటి రాబోయే తరానికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన అవసరం మనపై ఉందన్నారు. ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి, సంక్షేమ కోసం పాటుపడుతోందన్నారు. నిస్సహాయకులకు అండగా నిలవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదు అమలు చేశామన్నారు. వన్ టైం సెటిల్‌మెంట్ కింద రుణమాఫీ చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతి పక్షాలు రుణమాఫీపై రాజకీయం చేయాలని చూశారని, ప్రజల ఆగ్రహానికి లోనయ్యారని గుర్తు చేశారు. కేటీఆర్ ఊరించి ఊరించి రుణమాఫీ చేస్తున్నారని మాట్లాడుతున్నారని, పది సంవత్సరాలు అధికారంలో ఉండి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. మీరు చేసిన రుణమాఫీ రైతుల వడ్డీలకు సరిపోలేదన్నారు. అర్బన్ మండలంలోని ముంపు గ్రామాల సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని, గతంలో ముంపు గ్రామాల సమస్యల కోసం అనేక పోరాటాలు చేశామని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ హామీని నెరవేరుస్తా మన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రం రాజు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ముడికే చంద్రశేఖర్ యాదవ్, మాజీ సర్పంచులు ఊరడి రాంరెడ్డి, కదిరే రాజుకుమార్, పండుగ ప్రదీప్ మాజీ ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణస్వామి నాయకులు కత్తి కనుకయ్య, పోరెడ్డి రవీందర్, ఎర్రం సత్తయ్య, వనపట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎర్రం ఆగయ్య చిట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఇల్లంతకుంట, జూలై 22: పెండింగ్ బిల్లులు చెల్లించాలని తాజా మాజీ సర్పంచులు కోరారు. మండలంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు సోమవారం తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం, అధికారుల ఒత్తిడితో గ్రామాల్లో అప్పులు చేసి పనులు పూర్తిచేశామని, 2019 నుంచి బిల్లులు రాలేదని అన్నారు. ఒక్కో సర్పంచ్‌కు దాదాపు రూ.20 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు అక్కపెల్లి కరుణాకర్, ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య, జిల్లా కార్యదర్శి చల్ల నారాయణ, రవీందర్‌రెడ్డి, తూముకుంట శ్రీలతనరేందర్‌రెడ్డి, లక్ష్మి, పద్మ, చింతలపెల్లి తిరుప తిరెడ్డి, మల్లవ్వ, జ్యోతి,శిరీష పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు



అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీవో అలేఖ్య

వీర్నపల్లి, జూలై 22: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంతోపాటు అన్ని వసతులు కల్పిస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీవో అలేఖ్య తెలిపారు. అమ్మ మాట - అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా వీర్నపల్లి మండలం రంగంపేట, గర్జనపల్లి, వీర్నపల్లి, సీతారాం నాయక్ తండాతోపాటు ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల్లో కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

వేములవాడ టౌన్, జూలై 22 : వర్షాకాలంలో ఖాళీ స్థలాల్లో నీరు నిలవడంతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతాయని, మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి సిబ్బందికి సూచించారు. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్ అన్వేష్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ వానాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వార్డుల పరిశుభ్రత పాటిం చాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రాజన్న ఆలయ ఆడిట్ అధికారికి సన్మానం



సన్మానిస్తున్న ఆలయ ఉద్యోగుల సంఘం సభ్యులు

వేములవాడ కల్చరల్, జూలై 22 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆడిట్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న రమేష్ బదిలీపై వెళ్లడంతో ఆలయ ఉద్యోగులు సోమవారం ఘనంగా సన్మానించారు. రాజన్న ఆలయంలో లోకల్ ఫండ్ ఆడిట్ అధికారిగా విధులు నిర్వర్తించి హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ ఆడిట్ అధికారిగా బదిలీపై వెళుతున్న సందర్భంగా ఆలయ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు సిరిగిరి శ్రీరాములు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ప్రతాప నవీన్, పర్యవేక్షకులు సంతోష్, అరుణ్, మహేష్ సీనియర్ అసిస్టెంట్ నరేందర్, నక్క తిరుపతి, శ్రీనివాస్, ఎడ్ల సాయిశివ, వంశీ, రాజు తదితరులు ఉన్నారు.

న్యాయవాదుల మ్యూచువల్ కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలకు 20 నామినేషన్లు

సిరిసిల్ల క్రైం, జూలై 22: జిల్లా న్యాయవాదుల పరస్పర సహకార పరపతి సంఘం(అడ్వకేట్స్ మ్యూచ్‌వల్ కో-ఆపరేటీవ్ సొసైటీ) డైరెక్టర్‌ల ఎన్నికల ప్రక్రియలో భాగంగా సోమవారం నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 12 మంది డైరెక్టర్ స్థానాలకు 20 మంది న్యాయవాదులు నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ చేసుకోవచ్చని ఎన్నికల అధికారి అయిల్నేని కిశోర్‌రావు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

తంగళ్లపల్లి, జూలై 22: స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని మాజీ మున్సిపల్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆడెపు రవీందర్ పిలుపునిచ్చారు. సోమవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పూర్తిస్థాయి టీచర్లను నియమించాలి

వీర్నపల్లి, జూలై 22 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా టీచర్లను పూర్తిస్థాయిలో నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్ కుమార్ డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పాఠశాలలో ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం టీచర్లు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. గర్జనపల్లిలో పదోతరగతి విద్యార్థులకు ఇంకా పాఠాలు మొదలవలేదన్నారు. వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సంతోష్, కిరణ్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

బోయినపల్లి, జూలై 22: బోయిన్‌పల్లి మండలంలోని విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొలగం శ్రీనివాస్‌ను సోమవారం డీఈవో రమేష్ కుమార్ సన్మానించారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులు వేసే అదృష్టం కేవలం ఉపాధ్యాయులకే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ దేవి, టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు గసికంటి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి పుట్నాల జగన్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాకవి దాశరథి జయంతి



సిరిసిల్లలో నివాళులు అర్పిస్తున్న కవులు, రచయితలు



ఎల్లారెడ్డిపేటలో..

సిరిసిల్ల రూరల్ జూలై 22: మహాకవి దాశరథి కృష్ణమాచార్యులను శత జయంతిని సోమవారం సిరిసిల్లలో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల పట్టణంలోని గాంధీచౌక్‌లో మహాకవి దాశరథి జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఎలగొండ రవి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం పాలన వ్యతిరేకంగా ధిక్కారస్వర వినిపించిన కవి దాశరథి అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బూర దేవానందం, వెంగళ లక్ష్మణ్, అంకారపు రవి, ముడారి సాయికుమార్, కామారపు శ్రీనివాస్, గుండెల్లి వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కవి దాశరథి కృష్ణమాచార్యుల జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు పర్శరాములు, చంద్రమౌళి, విష్ణుప్రసాద్, సాగర్, భూమక్క, కవిత, గీత, గౌతమి, ప్రవళిక పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మహాకవి దాశరథి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు ఏర్పాటు చేశారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని శిరీష, ఉపాధ్యాయిని నల్ల భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 22: సివిల్ సర్వీసెస్‌లో దివ్యాంగుల కోటా రిజర్వేషన్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితాసభర్వాల్‌పై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా దివ్యాంగుల సమితి అధ్యక్షుడు మద్దాసు రాజేష్, ప్రధాన కార్యదర్శి మామిడాల నరేష్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐఏఎస్ అధికారి హోదాలో దివ్యాంగులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను దివ్యాంగుల సంఘాలు ఖండిస్తున్నాయన్నారు.సివిల్ సర్వీసెస్‌లో ప్రస్తుతం చాలామంది దివ్యాంగులు ఐఏఎస్ దేశానికి సేవలు అందిస్తున్నారన్నారు. స్మితాసభర్వాల్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పర్శరాములు, రాము, రాజేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీ అవతారంలో వాసవీమాత



ఎల్లారెడ్డిపేట, జూలై 22: ఆషాఢ మాసం సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్- రాచర్ల గొల్లపల్లి గ్రామాల్లోని ఆర్య వైశ్య సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళలు స్థానిక వాసవీ మాత ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ మాత శాకంబరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయాలతో అలంకరించారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్

రుద్రంగి, జూలై 22: ఆపత్కాలంలో నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ పథకం వరం లాంటిదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన 9 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గట్ల మీనయ్య, తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, చెలుకల తిరుపతి, మాడిశెట్టి అభిలాష్, ఇప్ప మహేష్, పిడుగు లచ్చిరెడ్డి, సూర యాదయ్య, స్వర్గం పరందామ్, గోడికారి హీరోజి, శ్రీనివాస్, దయ్యాల శ్రీనివాస్, దేశవేణి భూమేష్, నర్సయ్య పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి



సిరిసిల్లలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల రూరల్, జూలై 22: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీసీ డిక్లరేషన్ కాలయాపనపై సోమవారం బీజేపీ ఓబీసీ మోర్చా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి ఎన్నికల సభలో బీసీ డిక్లరేషన్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించారన్నారు. స్థానిక సంస్థలల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్‌లు 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామన్నారని తెలిపారు. ఓబీసీ మోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి అంకారపు రాజు, కౌన్సిలర్లు బోల్గం నాగరాజుగౌడ్, భాస్కర్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు వంగ అనిల్‌కుమార్‌గౌడ్, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు పండుగ మాధవి, ఎనగంటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేష్ అన్నారు. కామారెడ్డిలో జరిగిన కాంగ్రెస్ సభలో ప్రవేశపెట్టిన బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని ఓబీసీ మోర్చా మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంలోకి వచ్చిన ఆరు నెలలలోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని, స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటివరకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు క్యాబినెట్లో నిర్ణయాలు తీసుకోలేదన్నారు. వారం రోజుల్లో కార్యాచరణ ప్రారంభించకపోతే లక్షలాది మంది బీసీలతో కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు, నిరసన దీక్షలు చేపడతామన్నారు. ఈ కార్యమంలో మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చింతకుంట సాగర్, బీజేపీ మండల అధ్యక్షుడు పొంచెట్టి రాకేష్, ఓబీసీ నాయకులు ముడపల్లి ముకేశ్, చిలుముల హన్మయ చారి, పెరుక గంగరాజు, లోకోజు సతీష్, రాంరెడ్డి వెంకట్ రెడ్డి,పెరుక రంజిత్, మర్రి రాజు,నీరటి శేఖర్, సంఘనూరి దేవయ్య, నేవూరి రవి, దయ్యాల దేవయ్య, మ్యాకల జలందర్ తదితరులు పాల్గొన్నారు.



చందుర్తిలో వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మర్రిపల్లిలో వైద్య శిబిరం

వేములవాడ రూరల్ జూలై 22 : వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లిలో సోమవారం వైద్యాధికారి దివ్యశ్రీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలిసి డ్రై డే కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

రైతులకు చెక్కుల అందజేత

కోనరావుపేట, జూలై 22 : కోనరావుపేట మండలం కొలనూరు సింగిల్ విండో పరిధిలోని గ్రామాల రైతులకు ఎల్‌టీ లోన్లు మంజూరవగా సోమవారం సింగిల్ విండో చైర్మన్ రామ్మోహన్‌రావు చెక్కులను అందజేశారు. తోడి వెంకటరావుకు రూ.6 లక్షలు, వీరవేణి మల్లేశంకు రూ.5 లక్షల 50 వేలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ మహేష్, కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ విజయ్, పవన్, సింగిల్ విండో కార్యదర్శి గాజుల రాజేశం ఉన్నారు.

ఇంటి నిర్మాణ పనుల అడ్డగింత

- న్యాయం చేయాలని బాధితుడి వేడుకోలు

ఎల్లారెడ్డిపేట, జూలై 22: ఇంటి నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ అధికారుల అనుమతి ఉన్నా స్థానిక ఓ కుల సంఘం సభ్యులు అడ్డుకుంటారని, తనకు న్యాయం చేయాలని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బాధితుడు సత్యనారాయణ వేడుకున్నాడు. సోమవారం తన స్థలంలో బోరు బావి తవ్వించేందుకు వాహనం తీసుకురావడంతో సభ్యులు అడ్డుకున్నారని పేర్కొన్నాడు. 100 నంబర్‌కు డయల్ చేయడంతో స్థానిక పోలీసులు చేరుకొని చెప్పినా వినిపించుకోలేదని వాపోయాడు. పోలీసులతో వాగ్వాదానికి దిగారని పేర్కొన్నాడు. తన ఇంటి నిర్మాణ పనులను అడ్డుకుంటున్న సంఘం సభ్యులపై చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని బాధితుడు సత్యనారాయణ కోరాడు.

గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలి

ఎల్లారెడ్డిపేట, జూలై 22: గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాహెబ్ పేర్కొన్నారు. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంతోపాటు స్థానిక బస్టాండ్ ప్రాంతంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారి వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. కుక్కలు బెడద అధికంగా ఉందని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలలకు పంపకూడదని పేర్కొంటూ స్థానిక తాజా, మాజీ ఉప సర్పంచ్ రజిత జిల్లా విద్యాధికారి కార్యాలయంలోని అధికారులను వినతి పత్రం సమర్పించారు.

వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చందుర్తి, జూలై 22: చందుర్తి మండల కేంద్రంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ పార్లమెంటు సభ్యుడు వినోద్ కుమార్ జన్మదిన వేడుకలను సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, నాయకులు బత్తుల కమలాకర్, అట్ట పల్లి భూమయ్య, పోతారాజు నగేష్, మార్త గంగాధర్, మొగిలి రవి, మర్రి రాములు తదితరులు పాల్గొన్నారు.

28న దళితులు, సామాజిక న్యాయంపై సదస్సు

సిరిసిల్ల రూరల్, జూలై 22: దళితులు సామాజిక న్యాయంపై సిరిసిల్లలో ఈ నెల 28న సదస్సు నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ప్రకటించారు. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్ కార్మిక భవనంలో సోమవారం సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుంటి వేణు మాట్లాడుతూ పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో నిర్వహించే సెమినార్‌కు డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ కన్వీనర్ దండ్రుపల్లి రవీందర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్, అంబేద్కర్ సంఘాల జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఓయూ ప్రొఫెసర్ కాశీం, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మెంబర్ ఓరుగంటి ఆనంద్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నాయకులు గోనె ఎల్లప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.